క్లుప్తంగా

నన్నయలో ఆర్ట్ ఎగ్జిబిషన్


ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి శనివారం ప్రారంభించారు. ప్రముఖ చిత్రకారుడు పీసీ ప్రసాద్ ఆర్ట్ గ్యాలరీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల మూడు రోజుల పాటు అమలాపురంలో నేషనల్ ఆర్ట్ క్యాంప్ నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొని చిత్రలేఖనంలో తమ ప్రతిభను కనబరిచారు. ఆ చిత్రాలను విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చేలా యూనివర్సిటీలో ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 5 వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. కార్యక్రమంలో చిత్రకారుడు పీసీ ప్రసాద్, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా భావనాఋషి కల్యాణం


భావనాఋషి కల్యాణంలో పాల్గొన్న శివ దంపతులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో కొలువైన భద్రావతి సమేత భావనాఋషి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కల్యాణకర్తలుగా గ్రామానికి చెందిన తుమ్మూరి శివ చంద్రశేఖర్, లక్ష్మీ సుజాత దంపతులు వ్యవహరించారు. అర్చకుడు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో రుత్వికులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ


వక్తృత్వ పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

రాజానగరం: నెహ్రూ యువకేంద్రం జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో తమ కళాశాల విద్యార్థినుల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. నేషనల్ యూత్ పార్లమెంటులో భాగంగా ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఈ పోటీలు జరిగాయి. వీటిలో ×ఆరోగ్యం, సంక్షేమం, క్రీడలు‡ అనే అంశాలపై జరిగిన ఈ పోటీలో కె.లక్ష్మి, కె.షేకిన గిడ్యాన్, కె.రనిత విజేతలుగా నిలిచారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారని ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తెలిపారు.

సస్యరక్షణతో దిగుబడులు


రైతులతో మాట్లాడుతున్న హెచ్ఏ రిని

సీతానగరం: సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యానశాఖాధికారి పి.రిని సూచించారు. తోటబడి కార్యక్రమంలో భాగంగా కాటవరం, కూనవరాల్లోని ఆయిల్‌పామ్, మిర్చి పంటలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మిర్చిపంటను ఆశించిన నల్ల తమరపురుగు నివారణ పద్ధతులను తెలిపారు. ఉద్యాన సహాయకులు పి.నవ్య, ఆర్బీకే చైర్మన్ నల్లమోలు పాపారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అయిన చిన పాపారావు పాల్గొన్నారు.

కోటపాడులో పోలీస్ పికెటింగ్

రంగంపేట: కోటపాడులోని ఎస్సీ కాలనీ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 180లో కాలిబాట స్థలంలో పూర్వం నుంచి హిందూ శ్మశాన వాటికకు 0.30 సెంట్లు, ఎస్సీ శ్మశానం కోసం 0.50 సెంట్ల భూమిని వినియోగిస్తున్నారన్నారు. హిందూ శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించి, అందులో శివుని విగ్రహం ప్రతిష్ఠించడానికి శనివారం ప్రయత్నం చేయగా.. ఎస్సీ కులస్తులు అభ్యంతరం తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల పెద్దలతో మాట్లాడి ఈనెల 30 వరకు విగ్రహం ఏర్పాటు చేయకుండా నిలిపివేయడం జరిగిందన్నారు. అప్పటి వరకు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

పరిమితికి మించితే ప్రమాదమే..

- అతిగా ఎరువుల వాడకం అనర్థదాయకం
- క్షీణిస్తున్న భూసారం, తగ్గుతున్న దిగుబడి
- రైతులకు పెట్టుబడి భారం

పెదపూడి: పంట దిగుబడి అధికంగా రావాలన్న ఉద్దేశంతో రసాయన ఎరువులు, పురుగు మందులను భారీగా వినియోగించడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయి. ప్రధానంగా తెగుళ్లను అంతమొందించేందుకు విచ్చలవిడిగా ప్రమాదకరమైన పురుగు నివారణ మందులను కొందరు రైతులు పొలాలకు వినియోగిస్తున్నారు. దీంతో భూసారం తగ్గడమే కాకుండా దిగుబడి నామమాత్రంగానే వస్తోంది. రెండోసారి వేసిన పంటకు కనీస స్థాయిలో కూడా పెట్టుబడి రావడం లేదు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడానికి వ్యవసాయాధికారులు చేపడుతున్న చర్యలు ఫలితాన్ని ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు బయోమెట్రిక్ ద్వారానే ఎరువులు విక్రయించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇప్పటికైనా రసాయనిక ఎరువులు వినియోగం తగ్గిస్తే పంటలతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని పెదపూడి మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ చెబుతున్నారు.

అనపర్తి రాజానగరం నియోజకవర్గాల్లో..

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. మండలాల వారీగా అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, బిక్కవోలులో 13 వేలు, రంగంపేటలో 2 వేలు, రాజానగరంలో 8,060, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917 ఎకరాల్లో సాగువుతోంది. ఇప్పటికి ఆయా మండలాల్లో 30 శాతం మేర వెదజల్లు, వరినాట్లు విధానంలో సాగు పూర్తయింది.

భూసార పరీక్షలు

భూసార పరీక్షల ఆధారంగా రైతులు తమ పొలాల్లో ఎటువంటి మూలకాలు లోపించాయో తెలుసుకుని, వాటికి సంబంధించిన ఎరువులు మాత్రమే వేయాలి. దీనిపై గ్రామీణ ప్రాంతంలోని కొందరు రైతులకు అవగాహన లేకపోవడంతో తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించడం లేదు. తమకు తోచిన విధంగా విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. దిగుబడి మాట ఎలా ఉన్నా పంట భూములు విషతుల్యమవుతున్నాయి. ఈ భూముల్లో పంటలు తినడంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది.


పెదపూడిలో ఎరువు చల్లుతున్న రైతు (ఫైల్)

అతిగా వాడొద్దు



అధిక మోతాదులో రసాయన మందుల వినియోగం మంచిది కాదు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా, అధికారుల సూచనలు, సలహాలు మేరకు ఎరువులు వాడాలి. అధిక రసాయన ఎరువుల వినియోగంతో ఆ పంటలు తిన్న ప్రజలు ఆరోగ్యం దెబ్బతింటుంది. పైగా భూసారం కూడా క్రమంగా తగ్గిపోతోంది. పచ్చిరొట్ట, ఇతర సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలి.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖ అధికారి

ప్రభాత సూర్యునికి ప్రణమిల్లిన భక్తులు

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనపర్తి: మండలంలోని వివిధ ఆలయాల్లో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఇంటింటా దినకరునికి చిక్కుడు కాయలు, రేగుపండ్లతో కొబ్బరి ఈనెలను ఉపయోగించి రథాన్ని తయారు చేసి, చిక్కుడు, జిల్లేడు పూలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆవు పిడకలతో ఏర్పాటు చేసిన దాలిపై పాలు పొంగించి తయారు చేసిన క్షీరాన్నంతో పాటు చెరుకు, తెల్లదుంపలను భాస్కరునికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల్లో నిర్వహించిన ఆదిత్య హృదయం పారాయణ, సూర్య నమస్కారాలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్థానిక పాతవూరిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణమూర్తికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలరాజేశ్వరి పీఠంలో వేద పండితులు రెడ్డి సురేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కోరుకొండలో..

మధురపూడి: కోరుకొండ దేవుని కోనేరు వద్ద గల సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచీ స్వామికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవినేటి ప్రభాకరం, వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ చందు, పసుపులేటి బుల్లియ్య నాయుడు, కోడూరి సత్తిరెడ్డి, బొరుసు బద్రి, అయిల రామకృష్ణ, కోడినాగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

పెదపూడి: జి.మామిడాడలోని ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి ఆలయంలో రథసప్తమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని ఆలయంలో వేల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం కనుల పండవగా జరిగింది. ప్రత్యేక డప్పువాయిద్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.


కోరుకొండ సూర్యనారాయణస్వామి ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. రథసప్తమి సందర్భంగా స్వామి వారిని ఆమె దర్శించుకుని రథోత్సవాన్ని ప్రారంభించారు. ముందుగా కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, కర్రి వెంకట కృష్ణారెడ్డి(బాబు), ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసు బాలకృష్ణారెడ్డి, ఆలయ ఈఓ గాయత్రి పాల్గొన్నారు.

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.


జి.మామిడాడలో రథోత్సవం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి భార్య ఆదిలక్ష్మి

ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించి స్వామివారికి నైవేద్యం సిద్ధం చేశారు. అనంతరం సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. సూర్య నమస్కారాలు చేశారు. తొలుత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు గిరి ప్రదక్షిణ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం వెంకటగిరి చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్టు దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్వీ చందన తెలిపారు.


జి.మామిడాడలో చిన్నారుల కోలాటం


అనపర్తి పాతవూరు ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి


తంటికొండ వెంకన్న ఆలయ ప్రాంగణంలో పాలు పొంగిస్తున్న భక్తులు

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- లక్ష్మీనరసాపురంలో గడప గడపకూ

అనపర్తి: ప్రజాసాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురంలో శనివారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గడపలోనూ సంక్షేమ దివ్వెలు వెలుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే టీడీపీ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏ విధమైన సిఫారసులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీసులు అందజేసి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి దాట్ల కిరణ్ రాజు, ఎంపీటీసీ సూరకాసుల శివ, పంచాయతీ చంద్రగిరి వెంకటరమణ, దాట్ల జానకి రామరాజు, దాట్ల చిట్టిలోవరాజు, యాండ్రపు నాని, ప్రకాష్ పాల్గొన్నారు.


జగన్ ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ

అనపర్తి: తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సర్పంచి వారా కుమారి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు పాతవూరు కేఏఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ సహకారంతో జగనన్న విద్యాభారతి పేరుతో ముద్రించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సర్పంచి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఉప సర్పంచి చిర్ల వీర్రాఘవరెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం నల్లమిల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, ఎస్ఎంసీ సభ్యుడు జామి రమణ పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న వారా కుమారి, చిర్ల వీర్రాఘవరెడ్డి

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

- మత్స్యకారులకు అండగా ఉంటాం
- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీటీఆర్ఐ: మత్స్యకారుల కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన జాంపేట ఫిష్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజా పాల్గొన్నారు. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మత్స్యకార భరోసాతో పాటు సబ్సిడీపై రుణాలు, వాహనాలు అందించే పలు పథకాలు అమలవుతున్నాయన్నారు. జాంపేట ఫిష్ మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెలమ లక్ష్మణరావు, ఇతర సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.


నూతన కమిటీ బోర్డును ఆవిష్కరిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

గోకవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి పి.వీణాదేవి ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఎంపీడీఓ కేవీఎస్ఎన్ మూర్తితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తపల్లి జగనన్న కాలనీలో 335 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చామన్నారు. వీటిలో 18 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయని, పలు దశల్లో 45 ఇళ్లు ఉండగా, ఇంకా 272 ఇళ్లు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఉగాది నాటికి 43 ఇళ్లు పూర్తి చేయాలని, మిగిలిన గృహ నిర్మాణ పనులు త్వరత గతిని పూర్తి చేయాలని అధికారులును ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచుమర్తి కాటమస్వామి, పంచాయతీ కార్యదర్శి చిన్నకుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తపల్లి జగనన్న కాలనీలో అధికారులకు సూచనలిస్తున్న డీఎల్‌డీఓ వీణాదేవి

ఫ్యామిలీ ఫిజీషియన్

సీతానగరం: కాటవరంలో గ్రామ సచివాలయంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 120 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఎంపీయూపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి స్టీఫెన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంపై సదస్సు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్ క్రాస్, జువాలజీ డిపార్ట్‌మెంట్, జిల్లా పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'డ్రగ్ రహిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా' అనే అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు యువతలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్య వినియోగ నిరోధక చట్టం, వాటిని కలిగివున్న వారికి విధించే శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూడో పట్టణ సీఐ మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి జీవితంలో నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వసుధ, డాక్టర్ యు.రమేష్ బాబు, దుర్గారావు, డాక్టర్ ఎంఆర్ గౌతమ్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సంతోష్

నరసింహయ్య సంతాప సభ

గోకవరం: సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శనివారం నరసింహయ్య సంతాప సభను నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి కడితి సతీష్, రాష్ట్ర నాయకుడు కొండా దుర్గారావు ఆధ్వర్యంలో నరసింహయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల కోసం నరసింహయ్య చేసిన ఉద్యమాలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడు బాదంపూడి బాబూరావు, రంపచోడవరం డివిజన్ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం కోటి గ్రామంలోని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు పిన్ని శకుంతల (75) ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. అలాగే గాదరాడలో ప్రముఖ సినీ సంగీత దర్శకులు కుంచే రఘు తండ్రి లక్ష్మీనారాయణరావు ఇటీవల మరణించారు. ఆయన పెద్దకార్యానికి శనివారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు ఉన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

పెదపూడి: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. జి.మామిడాడ, పెద్దాడ గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, హెచ్ఎం కె.శ్రీనివాసు, సర్పంచ్‌లు లంక మున్ని, డొకుబుర్ర మీనాక్షి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం

రాజానగరం: దివాన్ చెరువు సచివాలయం–2లో శనివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘ ప్రతినిధి గ్రంధి నానబ్బులు లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ వైష్ణ శ్యామ్‌కుమార్ సేవలందించారు. సత్యసాయి సేవాసంస్థల యువజన అధ్యక్షుడు చిరంజీవి, సచివాలయం ఈఓ రమేష్, సుబ్రహ్మణ్యం, ఎన్‌వీకే విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మార్చి 23న సామూహిక ఉపనయనాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లోని నాళంవారి సత్రంలో మార్చి 23వ తేదీన వటువులకు ఉచిత సామూహిక ఉపనయనాలు చేయనున్నట్లు బ్రాహ్మణ హెల్ప్‌లైన్ అధ్యక్షుడు టీవీఎల్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 98855 67833, 93914 44441 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ కళాశాలలో ఫ్రెషర్స్ డే

కంబాలచెరువు: స్థానిక ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ అడాల విష్ణువర్ధనరెడ్డి అధ్యక్షత వహించారు. 2023 –24 విద్యాసంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలికారు. అనంతరం వ్యవసాయ రంగంలో ఏపీ సాధించిన ప్రగతిని ఉపకులపతి వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్లు కె.మాధవి, భవాని, ఎ.అనూరాధ, ఎం.విజయశంకర్‌బాబు, టి.ఉషారాణి, సాయి గంగాధర్ పాల్గొన్నారు.

వాహనాలకు వేలం

రాజమహేంద్రవరం రూరల్: నార్త్‌స్టేషన్ పరిధిలో సారా, అక్రమ మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలం ద్వారా రూ.1,63,500 ఆదాయం వచ్చిందని ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు తెలిపారు. ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఆవరణలో శనివారం 17 వాహనాలకు ఆయన పర్యవేక్షణలో నిబంధనలు పాటిస్తూ వేలం నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రూ.80 వేలు ధర నిర్ణయించగా, బిడ్డర్లు రూ.1,63,500కు వాహనాలను దక్కించుకున్నారు. అదనంగా జీఎస్టీ 18శాతం రూ.23,940 ప్రభుత్వానికి చెల్లించారు. వేలంలో ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో సూర్యకాంత్ త్రిపాఠి జయంతి

కంబాలచెరువు: ప్రముఖ ఛాయావాది, ప్రగతివాది కవి సూర్యకాంత్ త్రిపాఠి జయంతిని శనివారం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పీజీ సెంటర్ దక్షిణ భారత హిందీ ప్రచార సభ, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరాలా రచనల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. హిందీలో నిరాలా రాసిన కొన్ని కవితలను స్వీయానువాదంతో వినిపించారు. మాతృభాషను విస్మరించకుండా హిందీని సులభంగా ఎలా నేర్చుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో సంస్కృత విభాగాధిపతి ఆర్.రాజేశ్వరి, డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

కడియం: మాదక ద్రవ్యాల నిరోధంపై శనివారం దుళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిలక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలన్నారు. వాటి మత్తులో పడి జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఎస్ఐ అమీనాబేగం, హెచ్‌సీ నారాయణ, హైస్కూల్ హెచ్ఎం కె.సుధ పాల్గొన్నారు.